క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

జి.కొండూరు: పీఏసీఎస్ సభ్యురాలు జి.కొండూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతురాలి కుటుంబ సభ్యులకు పీఏసీఎస్ ద్వారా రూ. 10 వేలను చైర్మన్ వేములకొండ రాంబాబు చేతుల మీదుగా శనివారం అందజేశారు. గ్రామ పెద్దలు శాగం వెంకటేశ్వరరెడ్డి, బల్ల పంగిడియ్య, శివాజీ, సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి దాత ఒకరు శనివారం రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. పెనుగొలనుకు చెందిన సుగ్గల కృష్ణ, సాయిభార్గవి దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డికి అందజేశారు. అర్చకులు దాత దంపతులను ఆశీర్వదించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కిట్లు అందజేత



జూపూడి(ఇబ్రహీంపట్నం): మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం మండల సచివాలయాల కన్వీనర్ కోసూరు వెంకటేష్ ఆధ్వర్యంలో కిలేశపురం గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. బూత్ కమిటీ సభ్యులకు కిట్లు పంపిణీ చేశారు. వారు చేపట్టాల్సిన విధివిధానాలను వివరించారు. వైఎస్సార్ సీపీని మరలా అధికారంలోకి తెచ్చేందుకు బూత్ కమిటీ సభ్యులతో పాటు ప్రతిఒక్క కార్యకర్త సైనికుడిగా పనిచేయాలన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వైస్ ఎంపీపీ బాణావత్ నాగ బాలమ్మ, బూత్ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇరువురు మద్యం విక్రేతల అరెస్ట్

తిరువూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురు మహిళలను తిరువూరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శనివారం అరెస్టు చేశారు. తిరువూరు బోయకాలనీలో నల్లబోతుల స్వాతి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకుని దాడి నిర్వహించగా 23 సీసాలు లభ్యమయ్యాయి. ఎ.కొండూరు మండలం పాల్తియా తండాలో అజ్మీరా చిన్ని వద్ద 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. ఇరువురిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు.

వికాస్ డిగ్రీ కాలేజీకి ఏఐసీటీఈ అనుమతి మంజూరు

విస్సన్నపేట: స్థానిక వికాస్ డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్న బీబీఏ, బీసీఏ కోర్సులకు న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ ఒక్కొక్క కోర్సుకు 60 సీట్లతో అనుమతులు మంజూరు చేసిందని కళాశాల సెక్రటరీ నరెడ్ల నర్సిరెడ్డి శనివారం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం వరకు బీబీఏ, బీసీఏ కోర్సులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆదేశాలను అనుసరించి ఆయా రాష్ట్రాల హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్‌లు అనుమతులు మంజూరు చేయగా సంబంధిత యూనివర్సిటీలు అఫిలియేషన్ ఇచ్చేవి అన్నారు. అయితే 2024-25 సంవత్సరం నుండి మేనేజ్‌మెంట్ కోర్సు అయిన బీబీఏ, కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సు అయిన బీసీఏలను ఏఐసీటీఈ పరిధిలోకి కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. ఈ కోర్సులు నిర్వహించాలంటే ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతి తప్పనిసరి చేయటంతో తాము దరఖాస్తుచేసి అనుమతులు పొందామని నర్సిరెడ్డి వివరించారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

తిరువూరు: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జీవీ పూర్ణచంద్రరావు అన్నారు. స్థానిక బాపూజీ పెన్షనర్స్ హోంలో శనివారం జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో అసోసియేషన్ ముందుంటుందని చెప్పారు. ఏపీ సచివాలయ సంఘ మాజీ అధ్యక్షుడు పి. గురవయ్య, నాగరాజు, తిరువూరు రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బీవీ ప్రసాదరావు, అసోసియేట్ అధ్యక్షుడు శేషారావు తదితరులు పాల్గొన్నారు.

నాసా పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: నేషనల్ ఏరోనాటిక్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ పోటీ పరీక్షల్లో తిరువూరు శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు 20 మంది విజయం సాధించారని ప్రిన్సిపాల్ ఇబ్రహీం తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో అంతరిక్షంలో మానవుల నివాసంపై నాసా నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు సృజనాత్మకత ప్రదర్శించారన్నారు. వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయ ఊసరవెల్లి వసంత

- ప్రాణం ఉన్నంతవరకు వైఎస్సార్ సీపీని వీడనన్న కృష్ణప్రసాద్
- టీడీపీలో చేరి ప్రభుత్వంపై నిందారోపణలు
- అభివృద్ధి జరగలేదంటూ విషం కక్కుతున్న వైనం

జి.కొండూరు: ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీని వీడను. పార్టీ మారాల్సి వస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లలా పాలన సాగుతుంది. పేదలు బతకాలంటే జగనన్న పాలన ఉండాలి. తెలుగుదేశం పార్టీ నాయకులు పంది కొక్కుల్లా దోచుకున్నారు.. ఈ వ్యాఖ్యానాలన్నీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గతంలో అన్నవే. ఎమ్మెల్యేగా సొంత కంపెనీలకు ఇన్సెంటివ్‌ల రూపంలో లబ్ధి పొందారు. వందల కోట్లు బిల్లులు రాబట్టారు. చివరికి నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలకు, రెండుసార్లు ఓడినా గెలిపించుకున్న పార్టీకి వెన్నుపోటు పొడిచి టీడీపీ కండువా కప్పుకున్నారు. ముందస్తు వ్యూహంలో భాగంగా టీడీపీ నుంచి మైలవరం సీటును సాధించుకున్నారు.



నూతనంగా నిర్మించి ఇటీవల ప్రారంభమైన మైలవరం ప్రభుత్వాస్పత్రి భవనం (ఫైల్)

ముందస్తు వ్యూహమే..

2019లో టీడీపీపై వ్యతిరేక పవనాలు వీస్తున్న క్రమంలో రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందేమోనని భావించిన వసంత వైఎస్సార్ సీపీలో చేరి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభావంతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ ఆయన మనస్సు మాత్రం అప్పటి నుంచి టీడీపీ వైపే లాగింది. దీనితో నాటి నుంచి టీడీపీ నాయకులతో సత్సంబంధాలు నెరపుతూ మైలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని నిర్వీర్యం చేసేందుకు కుట్రకు తెరతీశారు. గతంలో పలు సభల్లో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన సాగుతుందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని మాట్లాడిన వసంత వెంకటకృష్ణప్రసాద్, ఇటీవల పార్టీ మారాలని నిర్ధారణకు వచ్చాక అభివృద్ధికి నిధులివ్వడం లేదంటూ కొత్త రాగం అందుకున్నారు. ఈ కుట్రలో భాగంగానే అంతిమంగా ముఖ్యమంత్రిపై నిందలు వేస్తున్నారు.

అసత్య ప్రచారమే ప్రధాన అస్త్రం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారం మొదలుపెట్టిన వసంత వెంకటకృష్ణప్రసాద్ అసత్య ఆరోపణలే ప్రధాన అస్త్రంగా తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. నియోజకవర్గానికి తానేమి చేస్తాడో చెప్పకుండా నిత్యం ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తూ ప్రజల నుంచి సింపతీని పొందాలని ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీలో ఉన్నంతకాలం రూ.300 కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని, తన చేతులతోనే నిర్మాణాలను ప్రారంభించానని చెప్పిన వసంత, నేడు పార్టీ మారగానే అభివృద్ధికి నిధులివ్వలేదంటూ కొత్త పాట పాడుతున్నారు. ఓటమి భయంతోనే వసంత వెంకటకృష్ణప్రసాద్ తన స్థాయిని మరిచి వ్యాఖ్యలు చేస్తున్నారని నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి ఇలా..

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.300 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. మైలవరం పట్టణ ప్రభుత్వాస్పత్రిని 30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.3 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించి ఆధునిక వసతులను కల్పించారు. దీనితో పాటు నియోజకవర్గంలో నాలుగు నూతన ఆస్పత్రి భవనాలు, ఐదు ఆస్పత్రి భవనాల అభివృద్ధికి రూ.4.88 కోట్లు ఖర్చు చేశారు. అదేవిధంగా 77 గ్రామ సచివాలయాలకు రూ.33.57కోట్లు, 62 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి రూ. 18.22 కోట్లు, 67 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి రూ.15.94 కోట్లు కేటాయించారు. 15 సహకార సొసైటీ భవనాల నిర్మాణానికి రూ. 4.56 కోట్లు, జగనన్న ఇళ్ల స్థలాల కొనుగోలు, అభివృద్ధికి రూ.76.15 కోట్లు, ఆర్ అండ్ బీ శాఖ తరపున రహదారుల అభివృద్ధికి 28.70 కోట్లు కేటాయించారు. నాడు-నేడు కింద రూ.24 కోట్లకు పైగా నిధులతో ప్రభుత్వ పాఠశాలల భవనాలను ఆధునికీకరించారు. నియోజకవర్గంలో రూ.300 కోట్లకు పైగా నిధులతో ప్రారంభమైన పనులు 80 శాతానికి పైగా నిర్మాణాలు పూర్తయి ప్రారంభించారు.

వసంతకు ఓటమి తప్పదంటూ సామాజిక మాధ్యమాల్లో చర్చ

రాజకీయ ఊసరవెల్లి వసంతకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తామంటూ మైలవరం నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే వీడియోలు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఒక వైపు నియోజకవర్గ ప్రజలు, మరో వైపు టీడీపీలోనే అసమ్మతి వర్గమైన దేవినేని ఉమామహేశ్వరరావు అనుచరులు, ఇలా రాజకీయ పోరు కొనసాగుతోంది. ఈ రాజకీయ పోరులో వసంతకు ముచ్చటగా మూడోసారి ఓటమి తప్పేలా లేదంటూ సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతోంది.

సర్నాల విజయమే లక్ష్యంగా పనిచేయండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రానున్న ఎన్నికల్లో మైలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు కక్ర హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొండపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని వార్డుల్లో పార్టీ పరిస్థితి, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రస్తుతం ప్రజల నాడి, పార్టీ నాయకుల సమన్వయంపై హర్షవర్ధన్‌రెడ్డి ఆరా తీశారు. 26వ వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ పట్టణంలో పార్టీ పరిస్థితి, ప్రజల మనోభావాలను ఆయనకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావును గెలిపించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డిని సన్మానించారు. వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు లంకే అంకమోహనరావు, ఎంఏబేగ్, ఆనంద్ పాల్గొన్నారు.



హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్, నాయకులు

వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన

పుట్రేల (విస్సన్నపేట): వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. పుట్రేల గ్రామంలోని సౌత్ ఎస్సీ వాడలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసును, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ని, ముఖ్యమంత్రిగా జగనన్నను మరలా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ కారుమంచి స్వాతి, ఉప సర్పంచ్ మద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎస్. అంజిరెడ్డి, గార్లపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి, మాజీ సర్పంచ్ లింగాల వెంకటరత్నం, నాయకులు బడుగు భాస్కరరావు, బెజ్జం అశోక్, వెంకటేశ్వరరావు, కొండా రాజు పాల్గొన్నారు.



పుట్రేలలో ప్రచారం చేస్తున్న సుధారాణి

ప్రతాప్ అప్పారావును గెలిపించుకుందాం

ఆగిరిపల్లి: ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావును అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపి కోరారు. శనివారం ఆగిరిపల్లి మూడో వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజారంజక పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగుల్ మీరా, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కన బోయిన పండు, వాకా సక్కేశ్వరరావు, జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యులు ఎస్‌కే సుభానీ, మైనార్టీ నాయకులు బాషా పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఓటు మీ భవిష్యత్తు.. వృథా చేసుకోవద్దు

ముసునూరు: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ఆ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కళాజాతా బృందం సభ్యులు సూచించారు. శనివారం సాయంత్రం ముసునూరు జగ్జీవన్‌రామ్ సెంటర్‌లో స్వీప్-2024 నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై కీర్తన కల్చరల్ సొసైటీకి చెందిన కళాజాతా బృందం సభ్యులు అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, ఆ హక్కే భవిష్యత్తు అని, దానిని వృథా చేసుకోకుండా, సద్వినియోగం చేసుకుని మంచి నేతలను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం సభ్యులు

ఎన్నికల నియమావళిని అతిక్రమించవద్దు

తిరువూరు: సాధారణ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ఎటువంటి సమావేశాలు నిర్వహించవద్దని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దవరం, కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం గ్రామస్తులకు ఎన్నికల నియమావళిపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు పెట్టడం, అనుమతి లేకుండా మైకు ప్రచారం నిర్వహించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విశ్రాంత ఉపాధ్యాయినికి సన్మానం

తిరువూరు: తిరువూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దీర్ఘకాలం ఉపాధ్యాయినిగా పనిచేసి పదవీ విరమణ చేసిన అనంత రామసీతను తెలుగు భాషా వికాస సమితి, ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. స్థానిక సిద్ధార్థ స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రామసీత ఉపాధ్యాయ వృత్తిలో నాలుగు దశాబ్దాల పాటు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. నిర్వాహకులు తోట ఉమామహేశ్వరరావు, రాంప్రదీప్, వాణి ఆమెను శాలువాలతో సత్కరించారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



విస్సన్నపేట: సెంట్రల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు స్థానిక వికాస్ పాలిటెక్నిక్ విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నరెడ్ల నర్సిరెడ్డి శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ వారు మార్చి 2న సెంట్రల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాలిటెక్నిక్ కాలేజీల నుండి 1,097 మంది విద్యార్థులు హాజరు కాగా 225 మంది ఎంపికయ్యారని చెప్పారు. వికాస్ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన వీర్ల హేమంత్, గరిడేపల్లి గోవర్ధన్, చందా లీలాసాయి మహేష్, తాళ్ల గిరి, బూడి సంతోష్‌కుమార్‌లు ఎంపికయ్యారని, ఈ మేరకు బోర్డు నుండి ఉత్తర్వులు అందాయని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను నర్సిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ కె. రమేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె. వీరబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఆగిరిపల్లి: మండలంలోని వట్టిగుడిపాడు పోలింగ్ కేంద్రాన్ని శనివారం డీఎస్పీ లక్ష్మయ్య పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు యంత్రాంగానికి సంపూర్ణ సహకారం అందించాలని చెప్పారు. ఎస్ఐ సురేంద్ర కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

35 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన పెనుగొలను వలంటీర్లు

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను-1 గ్రామ సచివాలయం పరిధిలోని 33 మంది వలంటీర్లు, రెడ్డిగూడెం మండలంలోని నాగులూరు గ్రామ వలంటీర్లు ఇద్దరు శనివారం రాజీనామా చేశారు. పెనుగొలను -1 గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లు తమ రాజీనామా లేఖలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లపై తెలుగుదేశం పార్టీ నాయకులు లేనిపోని నిందలు మోపి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ రాజీనామా చేశామని వారు చెప్పారు.

రెడ్డిగూడెం: మండలంలోని నాగులూరు గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్న వీర్ల సురేష్, పాదిలి శ్రీనివాసరావులు స్వచ్ఛందంగా శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఆశీర్వాదంకు అందించారు. తాము ప్రజలకు సేవలు చేస్తుంటే రాజకీయ పార్టీల నాయకులు నిందలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

జేసీ సంపత్‌కుమార్

మైలవరం: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.సంపత్‌కుమార్ తెలిపారు. మైలవరం మండలం మొర్సుమల్లి చెక్‌పోస్ట్, వెల్వడం, మైలవరంలోని పోలింగ్ బూత్‌లను రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. మైలవరం మండలంలో రాష్ట్రాల సరిహద్దులోని మొర్సుమల్లి గ్రామంలో చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. మైలవరం మండలం వెల్వడం, మైలవరం గ్రామాలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అక్రమ మద్యం, డబ్బు రవాణా జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు టీఆర్ రాజేశ్వరరావు, సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెల్వడంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ సంపత్‌కుమార్

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎవరి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏఈఆర్ఓ రమ్యశ్రీ అన్నారు. రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని 5వ గ్రామ సచివాలయంలో శనివారం ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ దఫా ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా, వినూత్నంగా సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం నిర్వహిస్తోందన్నారు. తద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేయనున్నామని చెప్పారు. ఓటింగ్ శాతాన్ని పెంచడంలో ప్రజా భాగస్వామ్యం అవసరమన్నారు. ఓటర్లు తమ మనస్సాక్షి ప్రకారం ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సదస్సులో ఈఓఆర్డీ శేషగిరిరావు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న రమ్యశ్రీ

ప్రలోభాలకు లొంగవద్దు..

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని ప్రథమ కర్తవ్యమని తహసీల్దార్ రాజు అన్నారు. గుంటుపల్లిలో ఓటుహక్కు ప్రాధాన్యత, 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకోవడంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కులం, మతం, జాతి, ప్రాంతం వంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వినియోగంపై కళాకారులు కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌బాబు, ఈఓపీఆర్డీ మనోజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈ అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం అధ్యాపకులు ఎ.నాగేశ్వరరావు పీహెచ్‌డీ అవార్డు అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మీడియా సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. తిరుచిరాపల్లి ఎన్ఐటీ ప్రొడక్షన్ ఇంజినీరింగ్ విభాగంలో రోడ్ సేఫ్టీ, ఎనలైజింగ్ డ్రైవర్ డిస్ట్రాక్షన్స్, డ్రైవింగ్ ఎర్రర్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ డిస్ట్రాక్షన్ డిటెక్షన్ సిస్టమ్ అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారని ప్రిన్సిపాల్ వివరించారు. తిరుచిరాపల్లి ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. జయపాల్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. అధ్యాపకులు నాగేశ్వరరావును డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎంబీఎస్ శ్రీకరరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.



అధ్యాపకుడు నాగేశ్వరరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తదితరులు

వామకుంట్లలో ప్రచారం



తిరువూరు: మండలంలోని వామకుంట్లలో శనివారం వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు తరఫున ఆయన సతీమణి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ స్వామిదాసుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ బుచ్చమ్మ, స్థానిక నాయకులు బసవయ్య, బాబు, చెన్నారావు, శేషు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి

ఆగిరిపల్లి: మామిడికి తెగుళ్లు రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక అన్నారు. శనివారం చొప్పరమెట్లలో మామిడి తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మామిడిలో బంగినపల్లి రకాలను ఆశించే నల్లమచ్చ తెగులు నివారణకు, కాయతొలుచు పురుగు నివారణకు, పండు ఈగ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కిరాణా వ్యాపారులపై చంద్రబాబు చులకన భావం వీడాలి

గంపలగూడెం: కిరాణా వ్యాపారులపై చంద్రబాబు చులకన భావం వీడాలని గంపలగూడెం హోల్‌సేల్ కిరాణా వ్యాపారి కొత్తగుండ్ల నరసింహారావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రావులపాలెం సభలో చంద్రబాబు మాట్లాడుతూ కిరాణా కొట్లలో గంజాయి వ్యాపారం చేస్తున్నారంటూ వ్యాపారులపై చేసిన విమర్శలను ఆయన ఖండించారు. కిరాణా వ్యాపారులు ఎక్కడైనా దుకాణాల్లో గంజాయి విక్రయించడం చంద్రబాబు కానీ, ఆయన కుమారుడు కానీ చూశారా? లేక కొన్నారా? అని ప్రశ్నించారు. నలభై సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు నోటికి ఏది వస్తే అది మాట్లాడటం సమంజసం కాదని నరసింహారావు హితవు పలికారు.

వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దు

కొత్తపల్లి(గంపలగూడెం): సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎవ్వరూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దని గంపలగూడెం ఎస్ఐ ఎస్. శ్రీను అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు తీసుకొనే చర్యల్లో భాగంగా శనివారం గంపలగూడెం మండలం కొత్తపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏ పార్టీ వారు ప్రత్యర్థి పార్టీలకు చెందిన వారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దన్నారు. ఎలక్షన్ ఫలితాలు వెలువడే వరకు చట్టాలు మరింత కఠినంగా అమలు చేస్తామని చెప్పారు. ముఖ్యంగా యువత రాజకీయ వివాదాల్లో తలదూర్చవద్దని, కేసులు నమోదైతే వారి జీవితాలు నష్టపోతారన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఇబ్రహీంపట్నం: రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. కేతనకొండ, మూలపాడు, త్రిలోచనాపురం, తుమ్మలపాలెం, గుంటుపల్లి గ్రామాల్లోని 16 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు నేతృత్వంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రలోభాలకు తావులేని స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. భద్రతా చర్యలు, వెబ్ కాస్టింగ్‌పై అధికారులకు తగు సూచనలు చేశారు. రెవెన్యూ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రచారం

ఆగిరిపల్లి: మండలంలోని ఎస్ఏ పేట, పిన్నమరెడ్డిపల్లి, రాజవరం, నూగొండపల్లి గ్రామాలలో వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.